క్లుప్తంగా

బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర టీచర్లు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కస్బా ఎంపీపీ పాఠశాలకు ఇటీవల బదిలీపై వచ్చిన ముగ్గురు ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుంకన్న మాట్లాడుతూ.. పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచిగా బోధించి వారికి చక్కటి భవిష్యత్తును అందించేలా కృషి చేయాలని సూచించారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు జక్కుల విజయ, ముంతాజ్‌బేగం, నీలి మహేశ్వరమ్మలను దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యప్రకాష్, హెచ్ఎంలు ప్రతాప్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆలయ పూజారి మృతి



సాగర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్య క్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయ పూజారి సాగర్(39) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ చంద్రుడు, మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, నాయకులు తిరుమలేష్, ఎద్దులన్న, సురేంద్ర నాయుడు, మహబూబ్, సత్యం రెడ్డి, తిమ్మయ్య, గురురెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నిర్మూలన



టీబీ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి

బనగానపల్లె: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటేనే వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ శారదభాయి అన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో ఐసీటీసీ మరియు టీబీ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. హెచ్‌ఐవీ నియంత్రణకు కృషి చేయాలని.. వ్యాధిగ్రస్తులకు ఏఆర్‌టీ మందులు సక్రమంగా అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ విజయలక్ష్మీ, టీబీ సిబ్బంది నరసింహులు, స్వచ్ఛంద సేవా సభ్యులు మధుకుమార్, హసీనా, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ



మట్టి విగ్రహాలు అందిస్తున్న ప్రెసిడెంట్ రామరాజు

కొలిమిగుండ్ల: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మంగళవారం కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికులు, ఉద్యోగులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. యూనిట్ హెడ్ మీనాక్షి సుందరం, ప్రెసిడెంట్ రామరాజు చేతుల మీదుగా 200 విగ్రహాలను అందజేశారు. పర్యావరణానికి హాని కలగకుండా ఉండేందుకు మట్టి విగ్రహాలను పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు. గణనాథుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకున్నారు. జనరల్ మేనేజర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో ధైర్యంగా ముందడుగు వేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత

బనగానపల్లె రూరల్: మహిళలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని సమాజంలో తమ స్థానం నిలబెట్టుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్త్రీల సమానత్వ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..స్త్రీలు సమాన హక్కుల కోసం రాజీ పడకుండా ఎదగాలన్నారు. ఇంట్లోనూ, సమాజంలోనూ స్త్రీలకు గౌరవం, సమాన హక్కులు రావాలన్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు హక్కులతో పాటు బాధ్యతగా మెలిగి తమ ఇంటికి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అధ్యాపకులు వసుంధర, నీతమ్మ, కౌసల్యదేవి, వరలక్ష్మీ స్త్రీల సమాన హక్కుల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.







కోవెలకుంట్ల: వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు, కోవెలకుంట్లలో వినాయక విగ్రహాలను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న భక్తులు, బనగానపల్లెలో పూజలకు ముస్తాబైన గణనాథుడు

చవితి సందడి

- వాడవాడలా గణనాథుని మండపాలు
- నేడు పూజలు అందుకోనున్న గణపతి
- కొనుగోలు దారులతో కిక్కిరిసిన దుకాణాలు, మార్కెట్లు



బేతంచెర్ల: పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



బేతంచెర్ల: వేంకటేశ్వరస్వామి ఆలయ గోపురం సెట్టింగ్

కోవెలకుంట్ల: మతసామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు అత్యంత వైభవంగా జరుపుకునే వినాయక చవితి వేడుకలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని మండపాల్లో గణనాథులు కొలువుదీరేందుకు సిద్ధంగా ఉన్నారు. స్థానిక ఆర్కే పెట్రోల్‌బంకు ఆవరణ, మార్కెట్‌యార్డు సమీపంలో, బనగానపల్లె రహదారిలో వివిధ రూపాల్లో వినాయక ప్రతిమలను విక్రయానికి సిద్ధంగా ఉంచారు. ఒక అడుగు నుంచి 12 అడుగుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక ప్రతిమలను విక్రయిస్తున్నారు. ఈ ఏడాది గ్రామాల్లో వినాయక చవితి సందడి ముందస్తుగానే కొనసాగుతోంది. వారం క్రితం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను ఊరేగింపుగా మండపాలకు తరలిస్తున్నారు. తెల్లారితే పండుగ కావడంతో కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, సంజామల మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు వినాయక ప్రతిమలను మండపాల్లో కొలువుంచేందుకు ప్రతిమలను తీసుకెళుతున్నారు. పండుగను పురస్కరించుకుని కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం మండపాల్లో వినాయక ప్రతిమలను కొలువుంచి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. ఆయా గ్రామాలకు చెందిన మహిళలు పూజా సామగ్రి కొనుగోలులో నిమగ్నమయ్యారు.

పండుగ వాతావరణం

బేతంచెర్ల: కులమతాలకు అతీతంగా జరుపుకునే పండుగల్లో వినాయక చవితి ప్రత్యేకత ఉంది. ఈసారి కూడా చిన్నారులు, యువకులు చందాలు వసూలు చేసి విగ్రహాలను కొనుగోలు చేసి బేతంచెర్లతో పాటు గ్రామాల్లో కొలువుదీరుస్తున్నారు. కేంద్ర ఉత్సవ గణేష్ సమితి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు ప్రతిష్ఠిస్తున్నారు. మండపాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పట్టణంలో పండుగ సందడి నెలకొంది. మండపాల నిర్వాహకులు, భక్తులు బిల్వపత్రం, ఉత్తరేణి, గరక, సీతాఫలం, మారెడు, తంగెడు, అరటి ఆకులు తదితర పూజా సామగ్రి కొనుగోలుతో దుకాణాల్లో రద్దీ నెలకొంది. స్వీట్ షాపుల్లో నెయ్యితో తయారు చేసిన వినాయక లడ్డూలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈనెల 30న జరగనున్న వినాయక నిమజ్జనం కోసం నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు రహదారిపై ఉన్న వినాయక ఘాట్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

భారీగా విగ్రహాల ఏర్పాటు

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో వినాయక విగ్రహాలను భారీగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. కొలిమిగుండ్ల మండలంలో 130, అవుకు మండలంలో వందకు పైగానే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నిర్వాహకులు రెండు పోలీస్ స్టేషన్లలో అనుమతి తీసుకున్నారు. విగ్రహాల విషయంలో నిర్వాహకులు ప్రత్యేకతను చాటుకునేలా ఆకర్షణీయ రూపాల్లో ఉండే విగ్రహాలను కొనుగోలు చేశారు. చాలా గ్రామాల్లో రూ.50 వేలకు పైగానే వెచ్చించారు. మండపాల వద్ద పోటా పోటీగా డెకరేషన్‌లు చేసుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధం చేసుకున్నారు. ఇతర పట్టణాల నుంచి విగ్రహాలను తీసుకొని గ్రామాల్లోకి రాగానే బాణసంచాలు పేల్చి, డప్పు వాయిద్యాల మధ్య మండపాల వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు.

గణనాథుల మండపాలు సిద్ధం

బనగానపల్లె రూరల్: మండలంలో వినాయక చవితి పండుగకు మండపాలు ముస్తాబయ్యాయి. బనగానపల్లె పట్టణంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటి సమీపంలో ఉన్న మైదానం, పెండేకంటినగర్, బీసీ కాలనీ, నాయీ బ్రహ్మణ కాలనీ, కరెంట్ ఆఫీస్ ఏరియా, కరీమ్‌బాగ్, బీసీ కాలనీ, రంగరాజుపేట, కొండపేట, భానుముక్కల, ఎస్సీకాలనీ తదితర కాలనీల్లో ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండపాలను విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కొనుగోలుదారులు, వ్యాపారులతో పట్టణంలోని పలు ప్రధాన రోడ్లు సందడిగా మారాయి.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

ప్యాపిలి: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడినే పూజిద్దామని గుత్తి ప్రభుత్వ వైద్యాధికారి ఎల్లప్ప, ఏకలవ్య సేవా సమితి అధ్యక్షురాలు మనోరమ అన్నారు. స్థానిక ఏకలవ్య విగ్రహం వద్ద మంగళవారం మట్టి వినాయకుల పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం ద్వారా నీరుకలుషితమవుతాయన్నారు.సేవాసమితి సభ్యులు శేఖర్, శేషాద్రి, మహేంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు.

మట్టి వినాయకులను తయారు చేసిన విద్యార్థులు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం మట్టి వినాయకులను తయారు చేశారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు అందరం పాటుపడాలని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీనపాటి, లెక్చరర్లు రామకృష్ణయ్య, వెంకటరమణ, ఓబులేసు, మద్దిలేటి పాల్గొన్నారు.



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సత్తార్ హాజీ అన్నారు. మంగళవారం పట్టణంలోని శేషారెడ్డి ఆస్పత్రి ఎదురుగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుండా అశ్వర్థ నారాయణ, సభ్యులు మాణిక్యం, శ్రీధర్, సుబ్బారెడ్డి చేతుల మీదుగా 200 మట్టి వినాయకులను పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులను సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల డివిజన్ కన్వీనర్ నాగమోహన్, హిందూ ధార్మిక సంఘాల సభ్యులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలి



కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె/కోవెలకుంట్ల: వినాయక చవితి పండుగను బనగానపల్లె నియోజకవర్గ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆకాంక్షించారు. గణనాథుడి కటాక్షంతో అందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని.. ప్రతి కుటుంబానికి మేలు జరగాలని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ రాజారెడ్డి

అవుకు(కొలిమిగుండ్ల): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రాజారెడ్డి సూచించారు. మంగళవారం తహసీల్దార్ మల్లిఖార్జునరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏఈ ఫక్కీరయ్యతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఊరేగింపు సమయంలో డీజేలు ఉపయోగించరాదన్నారు. మద్యం సేవించి గొడవలకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కోనేటిలో గంబూసియా చేపల విడుదల



కోనేటిలో చేపలను వదులుతున్న అధికారులు

కోవెలకుంట్ల: పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయ ఆవరణలో ఉన్న కోనేటిలో మంగళవారం జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో గంబూసియా చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో దోమల ఉధృతి అధికమై విష జ్వరాలు ప్రబలే అస్కారం ఉందన్నారు. మలేరియా, డెంగీ జ్వరాలకు కారణమయ్యే దోమల లార్వాలను ఈ చేప పిల్లలు నిర్మూలిస్తాయన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, పరమేశ్వరరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వీరభద్ర, ఏఎన్ఎం సుజాత, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దోమలను అంతం చేయడమే లక్ష్యం

సంజామల: దోమల బెడదను అంతం చేయడమే లక్ష్యంగా గంబూసియా చేపలను పెంచడం జరుగుతుందని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్ అన్నారు. ముక్కమల్ల గ్రామంలోని రెండు బావుల్లో మంగళవారం గంబూసియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షకాలంలో నీరు నిల్వ ఉన్న చోట దోమల బెడద ఉంటుందని తెలిపారు. దోమల లార్వాను అరికట్టడానికి ఈ చేపలను వదిలినట్లు చెప్పారు. హెల్త్ అసిస్టెంట్స్ వీరభద్రయ్య, ఎంఎల్‌హెచ్‌పీ హేమేశ్వరి పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా రంగనాయుడు

డోన్ టౌన్: ఒంగోలులో జరిగిన సీపీఐ 28వ రాష్ట్ర మహా సభల్లో డోన్ పట్టణానికి చెందిన ఆ పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడును రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకున్నారు. దీనిపై స్థానిక పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

రిటైర్డ్ హెచ్ఎం మృతికి నివాళి

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన పాణ్యం సిమెంట్ ఉన్నత పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం బండారు సుబ్బారావు(90) అనారోగ్యంతో మృతిచెందారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కోవెలకుంట్లలో మోస్తరు వర్షం

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు ప్రాంతాల్లో వర్షం పడింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, ఆముదం, కంది పంటలతోపాటు ఈ నెలలో సాగు చేయాల్సిన పంటలకు అనుకూలంగా మారడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సభ్యులు

డోన్ టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్నా, మానవుల అభివృద్ధి కోసం యాంత్రీకరణ పేరుతో అటవీ సంపదను అతి వేగంగా కొల్లగొడుతున్నారన్నారు. దీని ఫలితంగా అడవులు మాయం అవుతూ వాతావరణంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. కార్యదర్శి రంగయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐఆర్ ఊసే ఎత్తకపోవడం శోచనీయం

ప్యాపిలి: పెండింగ్‌లో ఉన్న డీఏలు, 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రమేశ్ నాయుడు డిమాండ్ చేశారు. బావిపల్లి పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే డీఏలు, పీఆర్సీ, ఐఆర్ ప్రకటిస్తామని చెప్పిన కూటమి పెద్దలు ఇప్పటి వరకు వాటి ఊసే ఎత్తకపోవడం శోచనీయం అన్నారు. ఇతర వ్యవస్థలకు భిన్నంగా కేవలం విద్యావ్యవస్థలోనే ప్రభుత్వం యాప్‌ల పేరుతో రోజుకో కొత్త ప్రయోగం చేస్తోందన్నారు. ఆసెస్మెంట్ బుక్స్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే పరీక్ష విధానం కొనసాగించాలన్నారు. యూటీఎఫ్ నాయకులు అబ్దుల్ లతీఫ్, సర్వజ్ఞమూర్తి, మదన్‌గోపాల్, ఆంజనేయ ప్రసాద్, విశ్వనాథ్ రెడ్డి, ఇబ్రహీం, సాలయ్య, నందీశ్వరరెడ్డి పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

యూరియా అధిక ధరకు అమ్మితే చర్యలు



కోవెలకుంట్లలోని దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

సంజామల: ఎరువుల దుకాణాల్లో యూరియాను అధిక ధరకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ అనిల్ కుమార్, మండల వ్యవసాయ అధికారులు హెచ్చరించారు. మంగళవారం పేరుసోముల గ్రామంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి భూమ జ్యోతితో కలిసి తనిఖీ చేశారు. గతంలో అమ్మిన ఇన్వాయిస్‌లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాల్లో యూరియా ఉంచుకుని రైతులకు ఇవ్వకుంటే షాపు యజమానిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో 80 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ, మండల విస్తరణ అధికారి శ్రీకాంత్, వీఆర్వోలు ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో విజిలెన్స్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం రసాయన ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. విజిలెన్స్ అధికారులు సిద్ధయ్య, వెంకటప్రసాద్, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఎరువుల దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, నిల్వలు, స్టాక్‌బోర్డులను పరిశీలించారు. రైతులకు యూరియాను అందుబాటులో ఉంచి కొరత లేకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధిక ధరలకు విక్రయిస్తే ఆ దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

డోన్ వాసికి డాక్టరేట్



విజయానంద్

డోన్ టౌన్: ఎమ్మిగనూరు సమీపంలోని సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల హ్యూమానిటీస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డోన్ వాసి వై. విజయానంద్‌కు రాయలసీమ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎం.శరత్‌బాబు మార్గదర్శకత్వంలో ‘ది ఇష్యూస్ ఆఫ్ వయొలెన్స్, ఎక్స్‌ప్లాయిటేషన్ అండ్ పవర్ ఇన్ ద ప్లేస్ ఆఫ్ విజయ్ టెండూల్కర్’ అనే అంశంపై పరిశోధన పూర్తి చేయడంతో ఈ నెల 22వ తేదీ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అందజేసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది ఆయన్ను సత్కరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

డోన్ టౌన్ : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటు, నిమజ్జనంపై నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పోలీసులు స్పష్టం చేశారు. బుధవారం డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా హెచ్చరికలు జారీ చేశారు. ఉత్సవ కమిటీలు ఏపీ పోలీస్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలని, వాటిని పరిశీలించిన తరువాతే ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. అనుమతి పొందిన వారికి క్యూ ఆర్ కోడ్ ఉన్న కాపీ ఇవ్వబడుతుందని, దానిని ల్యామినేట్ చేసి మండపాల వద్ద ఉంచాలని సూచించారు. పోలీసులు అక్కడికి వచ్చి స్కాన్ చేసి రికార్డ్‌లోకి తీసుకుంటారని వివరించారు. గ్రామాల్లో మూడో రోజు, పట్టణంలో ఐదో రోజు విగ్రహాల నిమజ్జనం జరపాలని స్పష్టం చేశారు. ప్రతి మండపంలో సీసీ కెమెరాలు, విద్యుత్ కనెక్షన్ల భద్రతా చర్యలు తప్పనిసరి అని పేర్కొన్నారు. డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని తెలిపారు. నిమజ్జన రోజు పోలీసులు నిర్ణయించిన రూట్‌లోనే ఊరేగింపులు జరగాలని, ఆ ప్రదేశానికి పిల్లలు, వృద్ధులు, మహిళలు రాకుండా చూడాలని సూచించారు. ఏదైనా గొడవలు, అల్లర్లు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అదనపు గదుల నిర్మాణాలపై విచారణ

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదు గ్రామంలో నిర్మించిన అదనపు తరగతి గదుల నిర్మాణాలపై డీఈఓ జనార్దన్ రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన సంజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఈఓ తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం అలేబాదుతండాలోని ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈఓతో పాటు ఎంఈఓలు వెంకటేశ్వర్ నాయక్, మహేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయకుంటే పతనం ఖాయం

డోన్ టౌన్: కార్మిక హక్కులను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను కుదించి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని.. లేకుంటే ప్రభుత్వాల పతనం తప్పదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు హెచ్చరించారు. మంగళవారం కొట్లవారిపల్లె సీఐటీయూ కార్యాలయంలో జరిగిన 7వ మండల మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ లేబర్ కోడ్‌ల వల్ల ఉద్యోగభద్రత, కనీస వేతనాలు లేవని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వకపోవడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్న తీరును ఖండించారు.

మొరాయించిన గూడ్స్ రైలు



ఆగిన గూడ్సు రైలు దాటుతున్న ప్రజలు

డోన్ టౌన్: కాచిగూడ నుంచి డోన్ వైపునకు ట్యాంకర్లతో వస్తున్న గూడ్సు రైలు డోన్ పట్టణంలోని కర్నూలు రైల్వే గేటు దాటే సమయంలో మొరాయించడంతో పట్టాలపై నిలిచిపోయింది. ఈ గూడ్సు బండి ఇక్కడి నుంచి పాతపేట రైల్వే గేట్లు దాటి అవతలి వరకు పొడవు ఉండడంతో పాతపేట వైపు వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో నిలిచిపోయిన రైలు ఎంతకూ కదలకపోవడంతో పాదచారులు ప్రమాదం అని తెలిసినా రైలు ట్యాంకర్ల మధ్య నుంచి దాటి అవతలి వైపు వెళ్లారు. చివరకు 6.30 గంటల సమయంలో వేరే ఇంజిన్ సహాయంతో డోన్ రైల్వే స్టేషన్ వరకు లాక్కెళ్లారు.

కమ్యూనిటీ హాల్ స్థలం కోసం వినతి

ప్యాపిలి: కమ్యూనిటీ హాల్ నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని శ్రీవిఘ్నేశ్వర ఎరుకల ఏకలవ్య సేవా సంఘం నాయకులు పెనుగొండ బావయ్య, సెక్రెటరీ నాగసారి శివశంకర్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. నల్లమేకలపల్లి గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఏకలవ్య సేవా సంఘం నాయకులు భాస్కర్, ఆనంద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.